సాక్షి సూర్యాపేట

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



ఎడ్ల పందేలు ప్రారంభం

మఠంపల్లి శుభవార్త చర్చి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలను ప్రారంభించారు.

- IIలో



గంజాయి దహనం

రూ.5.10 కోట్ల విలువైన గంజాయిని శుక్రవారం నార్కట్‌పల్లి మండలం గుమ్మలబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో దహనం చేశారు.

- IIలో

గరిష్ఠం / కనిష్ఠం

42° / 26°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాలను సిద్ధంగా ఉంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

భానుపురి (సూర్యాపేట): అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి పోలింగ్ కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. శుక్రవారం ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, బీఎస్.లతతో కలిసి నిర్వహించిన వెబ్ ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చలువ పందిళ్లు, తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్ వంటి సౌకర్యం కల్పించాలన్నారు. వికలాంగులు, వయోవృద్ధుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు, వీల్ చైర్స్ అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలల బాధ్యతను పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాలను సీఈఓ పరిశీలిస్తారని పేర్కొన్నారు.

మతతత్వ బీజేపీని ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

కోదాడ రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో మతతత్వ బీజేపీ దాని మిత్రపక్ష అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ బీజేపీ అమలు చేయలేదని విమర్శించారు. గడిచిన పదేళ్లలో మోదీ ప్రభుత్వం దేశాన్ని సర్వనాశనం చేసి నిత్యావసర సరుకుల ధరలు పెంచి పేదలపై పెనుభారాన్ని మోపిందన్నారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పరిరక్షణకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, ఎం.ముత్యాలు, ములకలపల్లి రాములు, కుక్కడపు నళిని తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తి గావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా ముస్తాబు చేసి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణం జరిపి శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహా నివేదనచేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

నీటికి నాణ్యతా పరీక్షలు

- ప్రజారోగ్యం దృష్ట్యా పల్లెలకు శుద్ధజలం సరఫరాకు ప్రభుత్వం చర్యలు
- తాగునీరు కలుషితం కాకుండా చూడడమే లక్ష్యం
- ఇప్పటికే గ్రామానికి ఒకటి చొప్పున పరీక్ష కిట్లు అందజేత
- నాణ్యతా ఫలితాల నమోదుకు ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు



పంచాయతీ కార్యదర్శులకు క్లోరోస్కోప్ కిట్లు అందిస్తున్న అధికారులు (ఫైల్)

హుజూర్‌నగర్: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామీణ నీటి సరఫరా విభాగం (మిషన్ భగీరథ) ద్వారా అందిస్తున్న నీటి నాణ్యతను పరీక్షించేందుకు గ్రామాల వారీగా క్లోరోస్కోప్ కిట్లను పంపిణీ చేసింది. వాస్తవానికి మిషన్ భగీరథ పథకం కింద ప్రభుత్వం ఇంటింటికీ శుద్ధమైన తాగునీటిని అందిస్తోంది. అయితే నీటి సరఫరాలో పైపులైన్లు, గేట్‌వాల్వ్‌ల వద్ద లీకేజీలు ఏర్పడడం, ట్యాంకులు అపరిశుభ్రత వల్ల నీరు కలుషితం అవుతోంది. ఈ నేపథ్యంలో గ్రామాలకు సరఫరా చేస్తున్న నీటిని పరీక్షించేందుకు గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున గత నెలలోనే జిల్లాలోని అన్ని మండలాల్లో క్లోరోస్కోప్ కిట్‌ను పంపిణీ చేశారు. ఒక్కో కిట్‌లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించేందుకు రసాయనాలు, పరీక్ష నాళిక, నాణ్యతను సూచించే పత్రం, ఒక స్టాండ్, శుభ్రం చేసేందుకు బ్రష్ ఉన్నాయి.

మూడు చోట్లా పరీక్షలు

గ్రామాల్లోని తాగునీటి వనరులైన రక్షిత మంచినీటి బావులు, తాగునీటి ట్యాంకులు, బోరుబావులు, చేతిపంపులు, మినీ వాటర్ ట్యాంకులు ఇలా ప్రతి నీటి వనరును ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఈ వనరుల్లోని నీటిని మూడుచోట్లా కిట్ల సాయంతో పరీక్షలు చేయాలి. ఒకటి నీటి ట్యాంకు వద్ద, రెండోది ట్యాంకు నీటిని ఉపయోగించే ప్రదేశంలో, మూడోది నీటిని సరఫరా చేస్తున్న చివరి ప్రదేశంలో ఈ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఆ ఫలితాల ఆధారంగా నీరు తాగేందుకు పనికి వస్తుందా? లేదా? అనే విషయాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. నాణ్యతలో ఏమైనా వ్యత్యాసం ఉంటే ఆ నీరు తాగేందుకు పనికి రాదు. దీంతో ప్రత్యామ్నాయ వనరుల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలి. నీరు తాగేందుకు సురక్షితం కాకుంటే మిషన్ భగీరథ అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది.

ఇప్పటికే కార్యదర్శులకు తర్ఫీదు

భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఈ కిట్లు ఇస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వాటిని సక్రమంగా వినియోగిస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. కొన్నేళ్ల క్రితం నీటి నాణ్యతను పరీక్షించేందుకు గ్రామ పంచాయతీలకు కిట్లు పంపిణీ చేశారు. వాటిపై సరైన అవగాహన, నైపుణ్యం లేకపోవడంతో పరీక్షలు సరిగా నిర్వహించలేదు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు మైక్రోబయాలజిస్టులు ఇప్పటికే తర్ఫీదు ఇచ్చారు.

శుద్ధజలం అందిస్తాం..



ప్రజలకు శుద్ధజలం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ప్రతి గ్రామ పంచాయితీకి క్లోరోస్కోప్ కిట్‌ను అందించింది. నాణ్యతా పరీక్ష చేసిన నీరు తగిన ప్రమాణంలో ఉంటేనే తాగాలి. లేదంటే బ్లీచింగ్‌ను తగిన ప్రమాణంలో కలుపుకోవాల్సి ఉంటుంది. తాగునీటి ట్యాంకులను నెలలో మూడు సార్లు శుభ్రం చేసుకోవాలి. ట్యాంకు గోపురానికి జాలీ లాంటిది ఏర్పాటు చేసుకోవాలి. పైపులైన్ లీకేజీలు కాకుండా, పంపులకు ఆన్, ఆఫ్‌లు ఏర్పాటు చేసేలా సిబ్బందిని సమాయత్తం చేశాం.

– యాసా శ్రీనివాసరావు, ఈఈ, ఎంబీ ఇంట్రా, ఆర్‌డబ్ల్యూఎస్, సూర్యాపేట

25 మంది నామినేషన్ల తిరస్కరణ



నల్లగొండలో నామినేషన్ పత్రాన్ని చూపుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరిచందన

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల్లో మరో కీలక ఘట్టమైన నామినేషన్ల పరిశీలన ముగిసింది. నల్లగొండ లోక్‌సభ స్థానానికి మొత్తం 56 మంది అభ్యర్థులు 114 సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించగా వాటిని శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన సమక్షంలో పరిశీలించారు. ఇందులో నిబంధనల ప్రకారం సమర్పించని 25 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. 31 మంది అభ్యర్థుల నామినేషన్లు నిబంధనల ప్రకారం ఉండడంతో వాటిని ఆమోదించారు.

భువనగిరిలో పది..

సాక్షి, యాదాద్రి: భువనగిరి లోక్‌సభ స్థానానికి మొత్తం 61 మంది 116 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. అధికారులు స్క్రూటినీ చేసి సరిగాలేని 10 మంది నామినేషన్లను తిరస్కరించారు. ఎన్నికల పరిశీలకుడు క్షేత్రి మయూమ్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగేల సమక్షంలో నామినేషన్ల పరిశీలన జరిగింది. కాగా ఈనెల 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది.

ఫసల్ బీమాపై అవగాహన కలిగి ఉండాలి



వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దయానందం

- రాష్ట్ర అర్థ గణాంక శాఖ సంచాలకుడు దయానందం

భానుపురి (సూర్యాపేట): వచ్చే వ్యవసాయ సీజన్ నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు దీనిపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర అర్థ గణాంక శాఖ సంచాలకుడు జి.దయానందం అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన భూగర్భ జల శాఖలు, మండల ప్లానింగ్ గణాంక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం సాగుచేసిన పంటల పరిస్థితి, దిగుబడుల్లో వస్తున్న తేడాలు, అందుగల కారణాలను వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ ఉపగణాంక అధికారులు, మండల ప్లానింగ్ అధి కారులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూ చించారు. ఈ సమావేశంలో సంయుక్త సంచాలకుడు డి శివకుమార్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, గణాంక అధికారి శ్రీనివాసరావు, ఉపగణాంక అధికారులు కిషన్, రాజేష్, రామారావు పాల్గొన్నారు.

‘పాలిటెక్నిక్’తో భవితకు భరోసా

- పాలిసెట్–2024కు దరఖాస్తుల ఆహ్వానం
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు 28 వరకు గడువు
- మే 24న ప్రవేశ పరీక్ష
- జిల్లాలో నాలుగు రకాల డిప్లొమా కోర్సులు



తిరుమలగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

తిరుమలగిరి (తుంగతుర్తి): వచ్చే విద్యా సంవత్సరం (2024–25)కు గాను రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ప్రభుత్వం పాలిసెట్ ద్వారా ఆహ్వానం పలుకుతోంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ ఈ నెల 28వ తేదీ వరకు ఉంది. పాలిసెట్ మే 24న ఉండగా పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.250, బీసీ, ఓసీ విద్యార్థులకు రూ.500 చెల్లించాల్సి ఉంది. అయితే పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు విద్యార్థుల భవితకు భరోసా లభించనుందని నిపుణులు పేర్కొంటున్నారు.

రెండు కళాశాలల్లో సీట్ల వివరాలు

తిరుమలగిరి	
సివిల్ 60	మెకానికల్ 60
సూర్యాపేట	
మహిళా పాలిటెక్నిక్ కళాశాల	
సివిల్ 60	సీఈసీ 60, కంప్యూటర్ 60

జిల్లాలో రెండు కళాశాలలు

సూర్యాపేట జిల్లాలో మొత్తం రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మహిళా పాలిటెక్నిక్ కళాశాలతోపాటు, తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో మరో జనరల్ కళాశాల ఉంది. వీటిల్లో హాస్టల్ వసతి కూడా ఉంది. తిరుమలగిరిలో సివిల్, మెకానిక్, సూర్యాపేటలో సివిల్, ఈసీఈ, కంప్యూటర్ కోర్సుల్లో ఒక్కొక్క విభాగానికి 60 సీట్ల చొప్పున మొత్తం 300 సీట్లు ఉన్నాయి.

పదో తరగతి విద్యార్హతతో..

పదోవ తరగతి రెగ్యులర్, కంపార్ట్‌మెంటల్‌గా ఉత్తీర్ణులైన వారు పాలిసెట్ రాయడానికి అర్హులు. గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవ శాస్త్రం సబ్జెక్టుల నుంచి మల్టీపుల్ ఆప్షన్ సబ్జెక్టులతో ప్రవేశ పరీక్ష ఉంటుంది. గణితంలో 60 ప్రశ్నలకు 60 మార్కులు, భౌతిక శాస్త్రంలో 30 ప్రశ్నలకు 30 మార్కులు, రసాయన శాస్త్రంలో 30 ప్రశ్నలకు 30 మార్కులు, జీవశాస్త్రంలో 30 ప్రశ్నలకు 30 మార్కులతో మొత్తం 150 ప్రశ్నలకు 150 మార్కులు ఉంటాయి.

డిప్లొమా తర్వాత

పాలిటెక్నిక్ మూడేళ్ల డిప్లొమా కోర్సులో భాగంగా ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ కూడా ఇస్తారు. మూడేళ్లు పూర్తయిన తరువాత విద్యార్థికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ అవకాశాలు నీటిపారుదల, రోడ్లు భవనాలు, ఆర్టీసీ, సింగరేణి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, రైల్వే డిపార్ట్‌మెంట్, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, బీహెచ్‌ఈఎల్ ట్రాన్స్‌కో అండ్ జెన్‌కో, ఎన్‌టీపీసీ, ఇండియన్ నేవీ, ఏయిర్ లైన్స్, ఇండియన్ ఆర్మీలతో పాటు మరెన్నో కంపెనీలలో లభిస్తాయి. డిప్లొమా తరువాత ఇంజనీరింగ్, డిగ్రీ ద్వితీయ సంవత్సరంలో నేరుగా చేరవచ్చు. లేదా డిప్లొమా తరువాత ఉద్యోగం చేస్తూ పార్ట్ టైంలో ఇంజనీరింగ్ చదివే వెసులుబాటు కూడా ఉంది.

ఒక పరీక్ష.. రెండు ర్యాంకులు

పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు ఎంపీసీ, బైపీసీ ర్యాంకులు ఉంటాయి. వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, యానిమల్ హజ్బెండరీ, ఫిషరీస్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కూడా పాలిసెట్ ఆధారంగానే జరుగుతాయి. ఈ కోర్సులు చేయాల్సిన విద్యార్థులు తప్పనిసరిగా జీవ శాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



స్వయం ఉపాధి పొందడానికి పాలిటెక్నిక్ విద్య ఉత్తమ మార్గం. ఇంటర్ పూర్తయ్యాక ఇంజనీరింగ్ చేసిన విద్యార్థులతో పోలిస్తే పాలిటెక్నిక్ ద్వారా ఇంజనీరింగ్ చేసిన విద్యార్థుల్లో ప్రాక్టికల్ పరిజ్ఞానం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ఎక్కువగా ఉంటాయి. ఉద్యోగ అవకాశాలు కూడా మెండుగా లభిస్తాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రవీందర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తిరుమలగిరి

ఉదయం 6 గంటలకే కాంటాలు ప్రారంభిస్తాం

- జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వరశర్మ

భానుపురి (సూర్యాపేట): హమాలీల సమ్మెతో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో కాంటాలు కాకుండా మిగిలిన ధాన్యాన్ని శనివారం ఉదయం 6గంటలకే కాంటాలు వేయిస్తామని జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వరశర్మ తెలిపారు. హమాలీలు ఆకస్మికంగా 7 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మార్కెట్ కార్యదర్శికి ఇచ్చి వెళ్లిపోయారని పేర్కొన్నారు. శుక్రవారం హమాలీల మెరుపు సమ్మె నేపథ్యంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. అప్పటికే ఈ–నామ్ విధానంలో 30వేల బస్తాల ధాన్యానికి ధరలు నిర్ణయించామన్నారు. హమాలీల సమస్యలతో రైతులు ఇబ్బందులు పడ్డారని, జిల్లా కలెక్టర్ వెంకటరావు ఆదేశానుసారం శనివారం ఉదయం 6గంటలకే కాంటాలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ధరలనే యథావిధిగా ఉంచి రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

- డీఎంహెచ్‌ఓ కోటాచలం



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

సూర్యాపేట: ప్రతి ప్రైవేట్ ఆస్పత్రి ప్రభుత్వ నిబంధనలు పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ వైద్యశాలలు నడుపుతున్న యజమానులు, వైద్యులకు వివిధ చట్టాలపై శుక్రవారం సూర్యాపేటలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారి సమాచారం వెంటనే మాకు తెలియజేయాలని కోరారు. రెగ్యూలర్ ఆస్పత్రులు రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రైవేట్ వైద్యులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాతశిశు కార్యక్రమ పోగ్రాం అధికారి డాక్టర్ జయ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, జిల్లా మాస్ మీడియా అధికారి అంజయ్య, ఎస్‌ఓ వీరయ్య, డీపీఓ కిరణ్, కార్తీక్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ధాన్యంలో తేమశాతం చెక్ చేస్తున్న జెడ్పీ సీఈఓ

పెన్‌పహాడ్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ అప్పారావు, డిప్యూటీ సీఈఓ శిరీష అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం రాశులు, రికార్డులను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి తరలించిన ధాన్యాన్ని మిల్లర్లు సకాలంలో దిగుమతి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏఓ బి.కృష్ణసందీప్, సీసీ చెన్నయ్య, ఏఈఓ మనోజ్, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

‘ఏఏవై’ కార్డుదారులకు చక్కెర

- రేషన్ డీలర్లకు ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- ఇప్పటికే ఉత్తర్వులు ఉన్నప్పటికీ అందని పంచదార
- కార్డుదారులతో పేచీలంటూ డీడీలు చెల్లించని డీలర్లు



భానుపురి (సూర్యాపేట): రేషన్ షాపుల్లో అంత్యోదయ అన్నయోజన (ఏఏవై) కార్డుదారులకు ఇక నుంచి బియ్యంతోపాటు కిలో చక్కెరను సబ్సిడీపై తప్పనిసరిగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఎప్పటి నుంచో ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ప్రధానంగా రేషన్ డీలర్లు పంచదార కోసం డీడీలు చెల్లించకపోవడంతో కొన్నేళ్లుగా రేషన్ దుకాణాల్లో పంచదార సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పంచదార కిలో రూ.45 నుంచి రూ.48 వరకు ఉండగా.. పేదలకు భారంగా మారుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం వారిని ఆదుకునేందుకుగాను ఉచిత బియ్యంతో పాటు కిలో పంచదారను సబ్సిడీపై ఏఏవై కార్డుదారులకు అందించాలని ఆదేశించింది. ఈ ఆదేశాలు ఈసారైనా అమలవుతాయా లేదా అన్న సందేహాలు కార్డుదారుల్లో వ్యక్తమవుతోంది.

సూర్యాపేట జిల్లాలో 19,828 మంది కార్డుదారులు

జిల్లావ్యాప్తంగా మూడు లక్షలకు పైగా ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. మరో 19,828 అంత్యోదయ అన్నయోజన కార్డులు, 36 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల కారణంగా జిల్లాలో 19,828 మంది ఏఏవై కార్డుదారులకు కిలో చక్కెర అందే అవకాశముంది. ఇలా.. జిల్లాలోని లబ్ధిదారుల కోసం దాదాపు 19 మెట్రిక్ టన్నుల పంచదార కావాల్సి ఉండగా పౌరసరఫరాల శాఖ వద్ద ఈ మొత్తం పంచదార స్టాక్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కేవలం డీలర్లు డీడీలు కట్టని కారణంగానే పంచదార కేటాయింపులు జరగడం లేదు. తాజా ఉత్తర్వులతోనైనా జిల్లాలో పంచదార పంపిణీపై అవగాహన కల్పించి ఏఏవై కార్డుదారులకు పంచదార పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. లేదంటే అన్ని కార్డుల లబ్ధిదారులకు ఈ ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడుతున్నారు.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచే చక్కెర పంపిణీ నిలిపివేత


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు రేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు పంచదార, గోధుమలను ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తూ ఉండేది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన మొదటి నుంచే ఈ చక్కెర పంపిణీ నిలిచిపోయింది. ప్రధానంగా ఏఏవై కార్డుదారులకు మాత్రమే ఈ చక్కెరను పంపిణీ చేస్తుండడంతో తెల్లరేషన్ కార్డుదారుల నుంచి సమస్యలు వస్తున్నాయన్న సాకుతో రేషన్ డీలర్లు డీడీలు చెల్లించడం లేదని తెలుస్తోంది. సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు సైతం దృష్టి సారించని నేపథ్యంలో రాయితీపై ఇచ్చే చక్కెర పంపిణీ అటకెక్కినట్లయింది. అంతేకాకుండా రేషన్ దుకాణాల్లో ఇతర నిత్యావసర సరుకులు తీసుకెళ్లేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఒక్క బియ్యాన్ని మాత్రమే డీలర్లు పంపిణీ చేస్తున్నారు.

చక్కెర అందేలా చర్యలు తీసుకుంటాం

ఏఏవై కార్డుదారులకు రాయితీతో కూడిన కిలో చక్కెర అందించాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు లబ్ధిదారులకు చక్కెర అందేలా చర్యలు తీసుకుంటున్నాం. మే నెల కోటా బియ్యంతో పాటు పంచదార కోసం డీలర్ల నుంచి డీడీలు తీసుకుని పంపిణీ చేస్తాం. జిల్లాలో లబ్ధిదారులకు సరిపడా పంచదార అందుబాటులో ఉంది.

– మోహన్‌బాబు, డీఎస్‌ఓ

అన్నదాతలకు వానర కష్టాలు



జాజిరెడ్డిగూడెం వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో కోతులు హడలెత్తిస్తున్నాయి. అమ్మకానికి తెచ్చి యార్డు ఆవరణలో పోసిన ధాన్యం రాశులపై శుక్రవారం ఇలా కోతులు ఎగబడి చిందర వందర చేస్తూ రైతులను భయాందోళనకు గురిచేశాయి. - అర్వపల్లి

ఎన్నికల ప్రచారంలో బాలలు !

భువనగిరిటౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బాలలను ఉపయోగించే రాజకీయ పార్టీల గుర్తింపును ఎన్నికల కమిషన్ రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక భువనగిరి జిల్లా నాయకుడు కొడారి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గురువారం భువనగిరి పట్టణంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ తరఫున మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించిన రోడ్ షోలో కొందరు బాలలు పాల్గొన్నారని, దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. కొన్ని పార్టీలు డబ్బు, బహుమతులు ఆశచూపి బాలల చేత ఎన్నికల కరపత్రాలు పంపిణీ చేయించడం, ఫలానా గుర్తుకు ఓటు వేయండని ప్రచారం చేయించడం బాలల హక్కుల ఉల్లంఘన కింద భావించి ఆయా పార్టీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాలల హక్కులను కాపాడుటకు ప్రజలు, రాజకీయ నేతలు, ప్రజాస్వామికవాదులు, అధికారులు చిత్తశుద్ధితో కృషిచేయాలని కోరారు.

హరీష్‌రావుది రాజీనామా నాటకం

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

భూదాన్‌పోచంపల్లి: హరీష్‌రావు అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి రాజీనామా నాటకం ఆడుతున్నాడని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. రాజీనామా చేసి బీజేపీలోకి పోతావా అని హరీష్‌రావును ఉద్దేశించి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో, కార్నర్ మీటింగ్‌లో భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. హరీష్‌రావుకు ఇప్పుడు ప్రజలు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టిస్తామని, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని లేదంటే తల నరుక్కుంటా అని చెప్పి.. మాటమార్చిన మీ మామ కేసీఆర్ తల మొదట నరికి, ఆ తరువాత మా దగ్గరికి రావాలని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైందని, రైతు రుణమాఫీతో సహా ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. పదేళ్ల అధికారాన్ని అడ్డంపెట్టుకుని కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లు సంపాదించిందని ఆరోపించారు. వారికి కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు లేదన్నారు. కవితమ్మ జైలుకు పోయిందని, త్వరలో కేసీఆర్, కేటీఆర్ కూడా జైలుకెళ్లడం ఖాయమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలోకి ఎవరూ వచ్చిన చేర్చుకోవాలని చెప్పారని, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరడానికి జేబులో కండువాలు పెట్టుకొని తిరుగుతున్నారని అన్నారు. ఇక బీఆర్‌ఎస్ పార్టీ ఖేల్ ఖతం, దుకాణం బంద్ అవుతుందని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు.



మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి



దామరచర్లలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

మిర్యాలగూడ : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలోని కూడలిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తనను గెలిపిస్తే దామరచర్ల మండలంలోని థర్మల్ విద్యుత్ కేంద్రం, పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశం కల్పిస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎత్తిపోతల పథకాలను వెంటనే పూర్తి చేసి టెయిల్ లాండ్ భూములకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. దేశంలో సుస్థిరత, సమగ్రత, అభివృద్ధి ప్రధాని మోదీతోనే జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ కూటమి 400లకు పైగా సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, సాధినేని శ్రీనివాస్‌రావు, జానకిరాంరెడ్డి, సైదారావు, సీతారాంరెడ్డి, కణ్మంతరెడ్డి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

నడిగూడెం: రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించాలని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల్ని తామే ఇస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటుందని తెలిపారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, కోదాడ నియోజకవర్గ కన్వీనర్ నారాయణ, కో-కన్వీనర్ కృష్ణయ్య, మండల ఎన్నికల ఇన్‌చార్జి కవిత, మండల అధ్యక్షుడు సతీష్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మానిక్‌రావు సూర్యవంశీ



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మానిక్‌రావు సూర్యవంశీ

నల్లగొండ: రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని నల్లగొండ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మానిక్‌రావు సూర్యవంశీ అన్నారు. నల్లగొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించినట్లు తమ దృష్టికి తీసుకొస్తే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈవీఎం ద్వారా పోలింగ్ రోజు నిర్వహించే మాక్ పోలింగ్, సీ-విజిల్ యాప్, సువిధ తదితర అంశాల గురించి ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్ దాస్ మాట్లాడుతూ.. పోటీలో ఉన్న అభ్యర్థులు వారి ఎన్నికల ఖర్చును పక్కాగా నిర్వహించాలని, రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ ప్రతినిధులు అన్ని అనుమతులను సింగిల్ విండో ద్వారా ఇవ్వాలని వారికి విన్నవించారు. సమావేశంలో ఎన్నికల పోలీసు పరిశీలకుడు అమోఘ్ జీవన్ గాంకర్, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కేంద్రం తనిఖీ

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ హరిచందన, ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ, ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్ దాస్, పోలీస్ పరిశీలకుడు అమోగ్ జీవన్ గాంకర్ తనిఖీ చేశారు. అదేవిధంగా సోషల్ మీడియా, సువిధ, ఇంటిగ్రేటెడ్ జిల్లా కంట్రోల్ రూం, సీ-విజిల్ విభాగాలను వారు పరిశీలించారు. అనంతరం వారు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, సోషల్ మీడియా ద్వారా ఇచ్చిన ప్రకటనల గుర్తింపు, పెయిడ్ న్యూస్ స్కానింగ్, రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తదితర రిజిస్టర్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు, సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఆర్‌ఓ రాజ్యలక్ష్మి, ఎంఎంసీ సభ్యుడు యు. వెంకటేశ్వర్లు, జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు

ఎయిమ్స్‌పై కేంద్రం వివక్ష చూపుతోంది

- సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్



ప్రచారంలో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్‌పై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. శుక్రవారం ఆయన బీబీనగర్ మండలంలోని మక్తా అనంతారం, వెంకిర్యాల, రాఘవాపురం, బీబీనగర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిమ్స్ నిర్మాణం పూర్తయితే 5 జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. ఎయిమ్స్‌లో రోగుల సంఖ్య పెరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. మతాన్ని, దేవుడిని అడ్డం పెట్టుకొని బీజేపీ ఓట్లు రాబట్టాలని చూస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు బీజేపీకి సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. పేదల పక్షాన ఉండే సీపీఎంని ఆదరించాలన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే భువనగిరి జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పాటుపడతానని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేష్, మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు వెంకటేష్, దేవేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, జంగయ్య, ఉమర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి కొండపై హెల్ప్ డెస్క్



కొండపై బస్టాండ్‌లో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న ఈఓ, అనువంశిక ధర్మకర్త

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ సన్నిధిలో గల బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సమాచార కేంద్రం, హెల్ప్ డెస్క్‌ను దేవస్థాన అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కొండపైన ఇబ్బందులు పడకుండా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని వారు తెలిపారు. కొండపైన దర్శనం వేళలు, టిక్కెట్ ధరలు, ప్రసాద విక్రయశాలతోపాటు కొండపైన శివాలయం, దర్శనానికి వెళ్లే మార్గాలను సిబ్బందితో మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేసేలా ఈ హెల్ప్‌డెస్క్‌ను తీసుకువచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

రూ.5 కోట్ల విలువైన గంజాయి దహనం

- యువత మత్తుకు బానిస కావొద్దు: నల్లగొండ ఎస్పీ



గంజాయిని పరిశీలిస్తున్న నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో స్వాధీనం చేసుకున్న రూ.5,10,75,000 విలువైన గంజాయిని శుక్రవారం నార్కట్‌పల్లి మండలం గుమ్మలబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో దహనం చేశారు. నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 39 కేసుల్లో పట్టుబడ్డ 2,043 కేజీల గంజాయిని సీజ్ చేసి కోర్టు ఉత్తర్వుల ప్రకారం డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేసినట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, మత్తు పదార్థాల సరఫరాపై టోల్‌ఫ్రీ నంబర్ 87126 71111కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముగిసిన అంత్యక్రియలు

- ఆస్పత్రిలో కోలుకుంటున్న శ్రీకాంత్ భార్య నాగమణి

కోదాడ రూరల్: కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం బైపాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా వారి మృతదేహాలకు గురువారం రాత్రి అంత్యక్రియలు పూర్తయ్యాయి. ప్రమాదంలో మృతి చెందిన వారిలో జిల్లా శ్రీకాంత్‌తో పాటు అతని కుమార్తె లాస్య అంత్యక్రియలను వారి సొంత గ్రామమైన చిమిర్యాలలో నిర్వహించారు. శ్రీకాంత్ మూడేళ్ల చిన్న కుమార్తె లావణ్యతో తలకొరివి పెట్టించినట్లు బంధువులు తెలిపారు. ఆ చిన్నారి అమ్మానాన్న, అక్క ఎక్కడ ఉన్నారని, ఎప్పుడు వస్తారని దీనంగా అడుగుతుండడం పలువురిని కంటతడి పెట్టించింది. చిన్నారి ఎక్కువగా ఏడుస్తుండడంతో తలకు అంతర్గత గాయాలేమైనా అయ్యాయా అని పరీక్షల నిమిత్తం కోదాడ వైద్యశాలకు తీసుకెళ్లినట్లు బంధువులు తెలిపారు. ఇక ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గోవిందాపురానికి చెందిన నలుగురు రాంచందర్‌రావు, అతని భార్య మాణిక్యమ్మ, కొడుకు కృష్ణంరాజు, కోడలు స్వర్ణకుమారి మృతదేహాలకు రాంచందర్‌రావు తండ్రి కోటయ్య తలకొరివి పెట్టాడు. కాగా.. తీవ్రగాయాలపాలైన శ్రీకాంత్ భార్య నాగమణి ఖమ్మం ఆస్పత్రిలో కోలుకుంటుందని బంధువులు తెలిపారు. ప్రమాదంలో ఆమె భర్తతో పాటు కుమార్తె, తల్లిదండ్రులు, తమ్ముడు, మరదలు మృతి చెందిన విషయాన్ని ఆమెకు ఇంకా చెప్పలేదని బంధువులు పేర్కొన్నారు. ఆమె నోటికి తీవ్రగాయమై పళ్లు ఊడిపోవడంతో శస్త్రచికిత్స చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. ఇందుకు రూ.50వేలు కావాలని చెప్పారు. అయితే అయిన వారందరూ మృతి చెందడంతో వైద్యానికి అయ్యే ఖర్చుకు దాతల సాయం కోసం ఎదురుచేస్తున్నారు.

బత్తాయి చెట్లు, డ్రిప్ పైప్‌లు దగ్ధం

- రూ.4 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన బత్తాయి చెట్లు, డ్రిప్ పైపులు

త్రిపురారం: బత్తాయి చెట్లు, డ్రిప్ పైప్‌లైన్ దగ్ధమైన ఘటన త్రిపురారం మండలం జీ.అన్నారం గ్రామ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామంలో చిలుక వేణుగోపాల్‌రెడ్డి 5 ఎకరాల్లో బత్తాయి తోటను సాగు చేస్తున్నాడు. తోట సమీపంలో కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కూలీలు చెత్తకు నిప్పంటించడంతో ఆ నిప్పు వ్యాపించి బత్తాయి తోటకు అంటుకుంది. దీంతో 30 బత్తాయి చెట్లు, డ్రిప్, వాటర్ పైప్‌లు కాలిపోయి రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు దుర్మరణం


చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామానికి చెందిన పోవానపు రంజిత్(18) చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులోని రిలయన్స్ పెట్రోల్‌బంక్‌లోని స్టోర్‌లో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి డ్యూటీ ముగిశాక పోచంపల్లి మండలంలోని మెహర్‌నగర్ గ్రామంలో ఉన్న తన మేనమామ ఇంటికి వెళ్లాడు. రాత్రి అక్కడే ఉండి శుక్రవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు వస్తున్నాడు. ఈక్రమంలో మల్కాపురం శివారులో ఐటీసీఎల్ ఎదురుగా బైక్‌ను సిమెంట్ లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రంజిత్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ..


ఖమ్మంరూరల్: ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో లారీ ఢీకొన్న ఘటనలో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గోల్‌తండాకు చెందిన బానోత్ భూరి(58) అక్కడికక్కడే మృతి చెందింది. బంధువుల ఇంట్లో పెళ్లికి హాజరయ్యేందుకు శుక్రవారం వస్తున్న ఆమె వరంగల్ క్రాస్ రోడ్ వద్ద బస్సు దిగింది. అక్కడ మూత్రవిసర్జన కోసం రోడ్డు దాటుతుండగా వరంగల్ వైపు నుండి ఖమ్మం వెళ్తున్న లారీ అతివేగంగా ఢీకొట్టడమే కాక, ఆమె వీపుపై నుండి వెనుక చక్రాలు వెళ్లడంతో శరీరం రోడ్డుకు అతుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భూరి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

ఈతకు వెళ్లిన తండ్రీకుమారుడు గల్లంతు

- కుమారుడి మృతదేహం లభ్యం
- తండ్రి కోసం గాలింపు



బోడ నరేష్



సాయి (ఫైల్)

మోటకొండూర్, ఆత్మకూరు (ఎం) : మోటకొండూర్ మండలంలోని చాడ గ్రామంలో శుక్రవారం వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లిన తండ్రీ కొడుకులు ప్రమాదవశాత్తు అందులో గల్లంతయ్యారు. ఆత్మకూరు(ఎం) మండలంలోని రాయిపల్లి గ్రామానికి చెందిన బోడ నరేష్(40) ఆయన కుమారుడు బోడ సాయి(11) మోటకొండూర్ మండలంలోని చాడ గ్రామంలోని బంధువుల ఇంటికి ఎల్లమ్మ పండగ నిమిత్తం వచ్చారు. వేసవి తాపం ఎక్కువగా ఉండడంతో ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. బావిలో దూకిన ఇద్దరూ అందులో మునిగిపోయారు. బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని మృతదేహాల కోసం గాలించగా.. కుమారుడి మృతదేహం లభించింది. తండ్రి మృతదేహం కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తేజంరెడ్డి తెలిపారు.

సరదాగా ఈతకు వెళ్లి మృత్యువాత



అభిరానందన్ (ఫైల్)

మఠంపల్లి: స్నేహితులతో కలిసి వ్యవసాయబావిలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందాడు. వివరాలు.. ఖమ్మం జిల్లాకు చెందిన అభిరానందన్ (20) కోదాడలో బీ ఫార్మసీ చదువుతున్నాడు. మఠంపల్లి మండలం అల్లీపురంలో అతడి స్నేహితుడి చెల్లెలు పెళ్లి ఉండడంతో అంబేద్కర్ నగర్‌కు చెందిన స్నేహితుడు అక్షయ్‌ను పిలిపించుకుని మరికొందరితో కలిసి శుక్రవారం వెళ్లాడు. అక్కడ ఐదుగురు స్నేహితులు అల్లీపురం సమీపంలోని బావి వద్దకు చేరుకున్నారు. అయితే, అభిరానందన్ బావిలో దూకి తిరిగి బయటకు రాలేదు. దీంతో భయానికి గురైన స్నేహితులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వారు బావి వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గేదె కళేబరాన్ని ఢీకొట్టిన బైక్

- మహిళ మృతి

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వెళ్తున్న బైక్ అదుపుతప్పి గేదె కళేబరాన్ని ఢీకొట్టడంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని బి. చందుపట్ల గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడుతండాకు చెందిన బానోతు అమ్ములు(40) తన బంధువు బైక్‌పై సూర్యాపేటకు వస్తుండగా మార్గమధ్యలో చివ్వెంల మండలం బి. చందుపట్ల గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మ రహదారిపై గేదె కళేబరాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అమ్ములు కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు ఆమెను సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి భర్త బోడ్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. వెంకట్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించి, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో మహిళ..

నూతనకల్: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన సంఘటన నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్లలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ కోమటిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేసోజు బ్రహ్మచారి పెద్ద కుమార్తె ఆత్మకూర్(ఎస్) మండలం బొప్పారం గ్రామానికి చెందిన పడకంటి అరుణ(38) తన తల్లిగారి ఇంటికి వచ్చింది. తండ్రి నూతనంగా నిర్మిస్తున్న ఇంటిలో టేబుల్ ఫ్యాన్ వైర్ ప్రమాదవశాత్తు ఎడమ చేతికి తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతురాలి తండ్రి దేసోజు బ్రహ్మచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

డిండి: బైక్ అదుపుతప్పిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. డిండి మండల పరిధిలోని కందుకూర్ గ్రామానికి చెందిన ఎరుకల వెంకటయ్య(48) పనినిమిత్తం బైక్‌పై చెర్కుపల్లికి వచ్చాడు. పని ముగించుకొని స్వగ్రామానికి బయలుదేరగా వెంకటయ్య నడుపుతున్న బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బండరాయికి ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య చిట్టమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

నీటి కుంటలో పడి వృద్ధుడు మృతి

చౌటుప్పల్: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని చిన్నకొండూర్ గ్రామంలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెక్క రాములు(80)కి భార్యాపిల్లలు లేరు. మానసికస్థితి సరిగా లేకపోవడంతో ఒక్కడే బంధువుల గ్రామాలకు నడుచుకుంటూ వెళ్తుంటాడు. ఈక్రమంలో పది రోజుల క్రితం వలిగొండలోని సోదరి దుర్గమ్మ వద్దకు వెళ్లేందుకని ఇంటినుంచి బయల్దేరాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని బొమ్మలకుంటలో శవమై తేలాడు. ఈ విషయాన్ని అక్కడ పశువులు మేపుతున్న గ్రామస్తుడు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. మృతుడు ప్రమాదవశాత్తుగా కుంటలో పడి మృతిచెందినట్లు పలువురు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు దుర్మరణం

సంస్థాన్ నారాయణపురం: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురం శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వాహనదారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ మునావర్ (20), ఎండీ.షఫీ బతుకుదెరువు నిమిత్తం చౌటుప్పల్‌లో నివాసం ఉంటూ టైల్స్ వేసే కార్మికులుగా సంస్థాన్ నారాయణపురంలోని ఓ షాపులో పనిచేస్తున్నారు. మునావర్ శనివారం తన సొంతం గ్రామం బిహార్‌లోని హాజీపూర్ వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. పనులు పూర్తి చేసుకుని సంస్థాన్ నారాయణపురం నుంచి చౌటుప్పల్‌కు బైక్‌పై షఫీతో కలిసి వెళ్తున్నాడు. ఈక్రమంలో వెంకబావితండాకు చెందిన పానుగోతు భూపతి, కరెంటోత్ బబుల్ బైక్‌పై చౌటుప్పల్ నుంచి వెంకబావితండాకు వస్తుండగా గుడిమల్కాపురం శివారులో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మునావర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భూపతి, బబుల్‌కు గాయాలు కావడంతో చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మునావర్ మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై సంస్థాన్ నారాయణపురం ఎస్ఐ వివరాలు సేకరిస్తున్నారు.

గొడ్డలితో దాడి

బీబీనగర్: పాత కక్షలను మనసులో పెట్టుకొని ఓ మహిళపై మరో మహిళ గొడ్డలితో దాడి చేసింది. ఈ ఘటన శుక్రవారం బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో జరిగింది. ఎస్ఐ రమేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగూడెం గ్రామానికి చెందిన గుండెబోయిన సోని శుక్రవారం ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్తుండగా అదే సమయంలో గ్రామానికి చెందిన గుండెబోయిన మౌనిక పాత కక్షలను మనసులో పెట్టుకొని సోనిపై వెనుక నుంచి గొడ్డలితో దాడి చేసింది. దీంతో సోని తలకు తీవ్రగాయం కావడంతో ఆమెను గ్రామస్తులు భువనగిరిలోని ఆస్పత్రికి తరలించారు. సోని భర్త శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు ప్రారంభం



బండ లాగుతున్న గిత్తలు

మఠంపల్లి: మఠంపల్లిలోని శుభవార్త చర్చి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలను శుక్రవారం ఫాదర్ మార్టిన్ పసల ప్రారంభించారు. ఈ పోటీల్లో గుంటూరు, కృష్ణా, సూర్యాపేట జిల్లాలకు చెందిన 11జతల గిత్తలు తలపడ్డాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్ అల్లం బాల్‌రెడ్డి, బ్రదర్ వినోద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతి కిషోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లూర్దుమారెడ్డి, బాలరెడ్డి, గాలి చిన్నపురెడ్డి, బోయపాటి ఆంతోనిరెడ్డి, గోపులూర్దు మారెడ్డి, రాయ భాస్కర్‌రెడ్డి, టీఆర్ బాలశౌరెడ్డి, గాదె మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.